సాక్షి కర్నూలు

సోమవారం, 9, అక్టోబర్, 2023



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



శ్రీమఠంలో భక్తుల రద్దీ

మంత్రాలయం : శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు కావడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చారు. దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,616.28
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 51.519
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 2,235
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 9,356

న్యూస్‌రీల్

ముగిసిన అంతరిక్ష వైజ్ఞానిక ప్రదర్శన



ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కర్నూలు సిటీ: అంతరిక్ష వైజ్ఞానిక ప్రదర్శన ఆదివారం ముగిసింది. కర్నూలు నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో మూడు రోజుల పాటు ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో రాయలసీమ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఆకెపోగు ఆనంద రావు, ఇస్రో శాస్త్రవేత్త ఎస్ఎస్ మూర్తి మాట్లాడారు. ఇస్రో, షార్‌ల ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ కొనసాగిందన్నారు. విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని పెంచేందుకు ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. క్విజ్, వ్యాస రచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించి, 171 మందిని విజేతలుగా ఎంపిక చేసి బహుమతులు ప్రదానం చేశారు. మొత్తం 19,393 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ ప్రదర్శనను సందర్శించారు. ప్రిన్సిపాల్ డా.బి శ్రీనివాసరెడ్డి, వివిధ కాలేజీల అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు.

14 నుంచి దసరా ఉత్సవాలు



బేతంచెర్లలో విద్యుత్ దీపాలంకరణలో శ్రీమద్దిలేటి స్వామి, మహాలక్ష్మి అమ్మవార్లు

బేతంచెర్ల: వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో ఈనెల 14 నుంచి 23 వరకు దసరా నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ సీతారామ చంద్రుడు తెలిపారు. నవరాత్రుల సందర్భంగా ప్రతి రోజు అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఆలయంలో జరిగే దసరా నవరాత్రుల ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఉత్సవాల నేపథ్యంలో ఆర్ఎస్ రంగాపురం, బేతంచెర్ల పట్టణంలో విద్యుత్‌దీపాలతో స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు.

8.684 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పాదన నిరంతరాయంగా కొనసాగుతోంది. శనివారం నుంచి ఆదివారం వరకు 8.684 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఉత్పాదన అనంతరం దిగువ నాగార్జున సాగర్‌కు 17,678 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 1,500 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,450 , కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జలాశయానికి ఎటువంటి వరద నీరు చేరిక లేకపోయినప్పటికీ జలాశయం నుంచి దిగువ ప్రాజెక్టులకు 23,177 క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రస్తుతం జలాశయంలో 89.9248 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యామ్ నీటిమట్టం 854.20 అడుగులకు చేరుకుంది.

శ్రీశైల క్షేత్రమంతా శివస్వరూపం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలక్షేత్రమంతా శివస్వరూపంగా దర్శించాలని సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. హిందూ ధర్మప్రచారంలో భాగంగా నిర్వహిస్తున్న బ్రహ్మశ్రీ ప్రవచన కార్యక్రమం ఎనిమిదో రోజు ఆదివారం రాత్రి కూడా కొనసాగింది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మన సంస్కృతిలో వృక్షదేవతలు అనే భావన ఎంతో ప్రసిద్ధమని, శ్రీశైలంలో ఎన్నో దివ్యవృక్షాలు ఉన్నట్లుగా సాహిత్యం చెబుతోందన్నారు. బ్రహ్మదేవుడు కూడా ఒకానొక సందర్భంలో శ్రీశైలంలో తపమాచరించాడని స్కాందపురాణం చెప్తుందన్నారు. శ్రీరాముడు తన అవతారకాలంలో శ్రీశైలానికి విచ్చేసి శ్రీగిరి ప్రదక్షిణ చేశారన్నారు. ఇక్కడ పాతాళగంగలో సంకల్ప పూర్వకంగా స్నానం చేసిన వారు పాప నాశనాన్ని పొందుతారన్నారు.

మెడికల్ వైభవం



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నూతన ఐపీడీ భవన నిర్మాణం

వైద్యరంగంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఇప్పటికే రాష్ట్రంలో ఐదు మెడికల్ కాలేజీలు ప్రారంభించింది. కొత్తగా మరో ఆరు కాలేజీలను వచ్చే ఏడాది ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాకు కొత్తగా రెండు ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మంజూరయ్యాయి. ఇందులో ఇప్పటికే ఒకటి ప్రారంభం కాగా మరొకటి వచ్చే ఏడాది నాటికి ప్రారంభమయ్యేందుకు సిద్ధమవుతోంది.

- ఉమ్మడి జిల్లాలో ఐదు మెడికల్ కాలేజీలు
- మూడు ప్రభుత్వ, రెండు ప్రైవేటు కళాశాలలు
- ఇప్పటికే ప్రారంభమైన నంద్యాల మెడికల్ కళాశాల
- వచ్చే ఏడాది ప్రారంభం కానున్న ఆదోని కాలేజ్
- ఒక్కో దానికి రూ.500 కోట్ల నిధులు
- పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది పోస్టుల భర్తీ



నంద్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్యవిద్యను అభ్యసించి వేల మంది దేశ విదేశాల్లో పేరు ప్రఖ్యాతులు గడించారు. ఈ కళాశాలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచే గాక అనంతపురం, ప్రకాశం, వైఎస్సార్, కర్నాటకలోని బళ్లారి, రాయచూరు, తెలంగాణాలోని పలు జిల్లాల నుంచి రోగులు చికిత్స కోసం వస్తున్నారు. జిల్లాలో పదిహేనేళ్ల క్రితం వరకు ఇదొక్కటే కాలేజీ. ఆ తర్వాత శాంతిరామ్, విశ్వభారతి మెడికల్ కాలేజీలు ప్రైవేటు రంగంలో వచ్చాయి. దీంతో వైద్య విద్య సీట్ల సంఖ్య పెరిగింది. అయితే ప్రభుత్వ వైద్యకళాశాల లేని లోటు నంద్యాల, ఆదోని ప్రాంతాల్లో స్పష్టంగా కనిపించింది. ఈ లోటును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భర్తీ చేశారు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో ఒక ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఉండాలన్న ఉద్దేశంతో ఆయన నంద్యాలతో పాటు ఆదోనిలోనూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను మంజూరు చేశారు. ఒక్కో కళాశాల నిర్మాణానికి రూ.475కోట్లు కేటాయించారు. ఇందులో గత నెల నంద్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రారంభం కాగా ఆదోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ వచ్చే ఏడాది ప్రారంభించేందుకు యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నారు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో మొత్తం ఐదు మెడికల్ కాలేజీలు వచ్చినట్లయ్యింది. ప్రస్తుతం నాలుగు కాలేజీల్లో 700 మెడికల్ సీట్లు అందుబాటులో ఉండగా వచ్చే ఏడాది ఆదోని కాలేజీ ప్రారంభమైతే మరో 150 సీట్లు అందుబాటులోకి వస్తాయి. దీంతో వైద్యవిద్యార్థుల కల సాకారమవ్వడానికి మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వచ్చినట్లు అవుతుంది. టాలెంట్ ఉండి కాస్త కష్టపడి చదివితే చాలు మెడికల్ సీటు సులభంగా కొట్టేయొచ్చన్న భావన విద్యార్థుల్లో నెలకొంది.

మరింత దగ్గరగా వైద్యం

ఉమ్మడి జిల్లాలో ఐదు మెడికల్ కాలేజీలు అందుబాటులోకి రావడంతో జనరల్ హాస్పిటల్స్ సంఖ్య కూడా పెరిగింది. ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో జనరల్ హాస్పిటల్(సర్వజన వైద్యశాల) సాధారణం. ఇక్కడ ప్రజలకు వైద్యసేవలు ఉచితంగా అందుతాయి. ప్రస్తుతం ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో చికిత్సతో పాటు మందులూ ఉచితంగా ఇస్తుండగా ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో కేవలం చికిత్స మాత్రమే ఉచితంగా అందిస్తున్నారు. నిపుణులైన వైద్యులు, స్పెషలిస్టులు, నర్సింగ్ సేవలు, ఖరీదైన వైద్యపరీక్షలు మరింత చేరువగా జిల్లా ప్రజలకు అందుబాటులోకి వచ్చినట్లయ్యింది. ఒకప్పుడు ఏ చిన్న జబ్బు వచ్చినా కర్నూలులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రావాల్సి వచ్చేది. ఇప్పుడు నంద్యాల జిల్లా ప్రజలు నంద్యాల మెడికల్ కాలేజీతో పాటు శాంతిరామ్ మెడికల్ కాలేజీ, ఆదోని ప్రాంత ప్రజలు ఆదోనితో పాటు విశ్వభారతి మెడికల్ కాలేజీకి వెళ్లే అవకాశాలు ఏర్పడ్డాయి. దీనివల్ల భవిష్యత్‌లో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలపై భారం మరింత తగ్గే అవకాశం ఉంది. అప్పుడు పరిశోధనా చికిత్సలపై ఈ ఆసుపత్రి దృష్టి సారిస్తే మరింత నాణ్యమైన వైద్యం ఈ ప్రాంత ప్రజలకు అందే అవకాశాలు ఉన్నాయి.

మరింత ఆధునికంగా కర్నూలు పెద్దాసుపత్రి

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రూ.500కోట్ల నిధులతో ఆధునీకరణ పనులు, సరికొత్త భవనాల నిర్మాణం చేయనున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం రూ.100కోట్లతో అతి పెద్ద ఐపీ భవన నిర్మాణం వేగంగా సాగుతోంది. వచ్చే ఏడాది నాటికి దీనిని పూర్తి చేసే అవకాశాలు ఉన్నాయి. 80వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో దీని నిర్మాణం సాగుతోంది. ఇది పూర్తయిన తర్వాత మరికొన్ని భవనాలు నిర్మించేందుకు ఏపీ ఎంఎస్ఐడీసీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం డయాగ్నోస్టిక్ బ్లాక్‌లోనే మరో రెండు అంతస్తులు రూ.10కోట్ల అంచనాతో నిర్మిస్తున్నారు. ఇందులో అత్యాధునిక క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇది అందుబాటులోకి వస్తే ప్రస్తుతం ఏఎంసీలో రోగులు పడుతున్న ఇబ్బందులు తప్పనున్నాయి. ఈ బ్లాక్‌తో పాటు వైద్యులు, సిబ్బంది పోస్టులు కూడా మంజూరయ్యే అవకాశాలు ఉన్నాయి.

యుద్ధప్రాతిపదికన నిర్మాణాలు



ఉమ్మడి కర్నూలు జిల్లాలో కొత్త మెడికల్ కళాశాలలు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. ఇప్పటికే నంద్యాల మెడికల్ కాలేజీ పూర్తయ్యింది. మరికొన్ని నిర్మాణాలు అందులో చేయాల్సి ఉంది. ఆదోనిలో వచ్చే ఏడాది కంతా నిర్మాణం పూర్తయ్యేలా పనులు జరుగుతున్నాయి. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోనూ ఐపీ బ్లాక్ నిర్మాణం వేగంగా జరుగుతోంది. దీని నిర్మాణం పూర్తయితే దాదాపు 600 పడకలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

–టీవీ. శివకుమార్, ఈఈ, ఏపీఎంఎస్ఐడీసీ, కర్నూలు

వైద్య విద్యార్థులకు ఎంతో మేలు



ఉమ్మడి జిల్లాలో మూడు ప్రభుత్వ, రెండు ప్రైవేటు మెడికల్ కాలేజీలు ఉండటం వైద్య విద్యార్థులకు ఎంతో మేలు. టాలెంట్ ఉండి మరింత కష్టపడితే చాలు ఎంబీబీఎస్ సీటును సాధించవచ్చు. కొత్త కాలేజీలు రావడం వల్ల వందలాది మంది వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, నాల్గవ తరగతి ఉద్యోగులకు ఉపాధి లభిస్తుంది. వైద్యమూ ప్రజలకు మరింత దగ్గరై నాణ్యమైన చికిత్స అందించేందుకు అవకాశం ఏర్పడుతుంది.

–డాక్టర్ పి. సుధాకర్, ప్రిన్సిపాల్, కర్నూలు మెడికల్ కాలేజీ

ఆలయ భూముల లెక్క ఇక పక్కా

- జిల్లాలోని 1951 ఆలయాలకు చెందిన 47,004 ఎకరాలకు రక్షణ
- కంప్యూటరీకరణ, ఆన్‌లైన్‌లో వివరాలు నిక్షిప్తం
- రెవెన్యూ, దేవదాయ శాఖ ఫైళ్ల పునపరిశీలనతో 3,549 ఎకరాల పెరుగుదల



కర్నూలు కల్చరల్: దేవదాయ ధర్మదాయ శాఖకు చెందిన భూముల పూర్తి రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం సాంకేతికంగా పటిష్టమైన చర్యలు చేపడుతోంది. ఆలయ భూములన్నింటినీ కంప్యూటరీకరణ చేసి వాటి లెక్కలు పక్కాగా ఉండేలా దేవదాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలో ఉన్న భూములన్నింటినీ ఆన్‌లైన్ చేస్తున్నారు. ఈ సాంకేతిక జాగ్రత్తల్లో భాగంగా 1ఎ ప్రొఫార్మా ప్రకారం జిల్లాలోని 1,951 దేవాలయాలకు చెందిన 47,004 ఎకరాల భూములను కంప్యూటర్లలో నిక్షిప్తం చేసే ప్రక్రియ జరుగుతోంది. ఇప్పటి వరకు ఆలయ భూముల లెక్కలకు, రికార్డులకు పొంతన లేక ఇబ్బందులు తలెత్తేవి. ఈ లెక్కలు ఇక నుంచి కంప్యూటీకరణతో ఆన్‌లైన్ అవుతుండడంతో పారదర్శకంగా ఉండడమే కాక ఆ భూముల భద్రతకు ఢోకా ఉండదు. అక్రమార్కులు ఈ భూముల వివరాలను మార్పు చేసే అవకాశం లేకుండా ప్రభుత్వం పటిష్టమైన ఏర్పాట్లు చేస్తోంది. దేవదాయ శాఖ రికార్డులు, రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆలయాల వారీగా భూమి ఏ గ్రామంలో ఏ సర్వే నంబర్ ఉంది..ఎంతెంత కొలతలతో ఉంది..తదితర సమగ్ర వివరాలన్నీ ఆన్‌లైన్‌లోకి వస్తాయి.

భూముల డేటా అప్‌లోడ్‌లో ఈవోలు నిమగ్నం

జిల్లాలో దేవదాయ ధర్మాదాయ శాఖ అధీనంలో 1,951 ఆలయాలు ఉన్నాయి. ఇందులో 150 ఆలయాలు ఈవోల పరిధిలో ఉన్నాయి. భూముల వివరాలు కంప్యూటరీకరణ చేసేందుకు ఈవోలతో పాటు దేవదాయశాఖ ఉద్యోగులను ప్రతి మండలానికి ఒకరిని నియమించారు. వీరు భూముల రికార్డులను అంటే సర్వే నంబర్లు, విస్తీర్ణం, సరిహద్దులు వంటి వివరాలను అప్‌లోడ్ చేసే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఇప్పటికే భూములు అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. దీంతో పాటు సాంకేతిక జాగ్రత్తలతో ప్రభుత్వం భూములకు రక్షణ ఏర్పాట్లు చేస్తోంది. ఆలయ భూముల్లో ఎన్ని లీజులో ఉన్నాయి, ఎంత ఆదాయం వస్తోంది, ఎంత ఇనాంలో ఉంది వంటి వివరాలను కూడా ప్రత్యేక అధికారులు పక్కగా రూపొందిస్తున్నారు.

38 శాతం పూర్తి



దేవదాయ శాఖ పరిధిలో ఉన్న భూములను 1ఎ, 1బి ప్రొఫార్మాల్లో పొందుపరిచాం. ప్రస్తుతం 1ఎ ప్రొఫార్మా ప్రకారం మొత్తం భూములను ఆన్‌లైన్‌లో కంప్యూటరీకరణ చేయిస్తున్నాం. 43,455 ఎకరాలు ఉన్నట్లు గుర్తించాం. మీ ఇంటికి మీ భూమి ప్రకారం ఆర్ఎస్ఆర్‌లో వెరిఫై చేయడంతో 47,004 ఎకరాలు తేలింది. 3,549 ఎకరాలు పెరిగింది. ఈవోలు, ప్రత్యేక అధికారులతో మండలాల వారీగా క్షేత్ర స్థాయిలో భూములను పరిశీలన చేయిస్తున్నాం. క్లియర్‌గా ఉన్న భూములను ఆన్‌లైన్ ద్వారా కంప్యూటీకరణ చేయిస్తున్నాం. ఇప్పటి వరకు 38 శాతం పూర్తి అయింది.

– ఎమ్.రామాంజనేయులు, అసిస్టెంట్ కమిషనర్, దేవదాయ శాఖ

టమాట రైతుకు ప్రభుత్వం అండ

- ప్యాపిలి మార్కెట్‌లో 140 టన్నుల టమాట కొనుగోలు
- విజయవాడ, గుంటూరు, కర్నూలు జిల్లాల్లోని రైతుబజార్లకు తరలింపు



ప్యాపిలి మార్కెట్‌లో టమాటను కొనుగోలు చేస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): టమాట రైతులు నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. టమాట కిలో ధర రూ.7 కంటే తక్కువకు పడిపోయినపుడు మార్కెటింగ్ శాఖ అధికారులను రంగంలోకి దింపుతోంది. రైతుల వద్ద నుంచి మార్కెటింగ్ శాఖ అధికారులు టమాటను కొనుగోలు చేసున్నారు. ఇప్పటి వరకు ప్యాపిలిలోని మార్కెట్‌లో మార్కెటింగ్ శాఖ అధికారులు వేలంపాట ద్వారా రైతుల నుంచి 140 టన్నుల టమాట కొనుగోలు చేశారు. ఉమ్మడి జిల్లాలో ప్యాపిలి, డోన్, బేతంచెర్ల, పత్తికొండ, ఆస్పరి, పెద్దకడుబూరు, మద్దికెర, దేవనకొండ, కల్లూరు, ఓర్వకల్లు, కర్నూలు తదితర మండలాల్లో టమాట సాగైంది. పంట మొత్తం ఒకేసారి మార్కెట్‌లోకి రావడంతో ధరలు పడిపోయాయి. పత్తికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో కర్నూలు జిల్లా మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో టమాట కొనుగోళ్లు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నంద్యాల జిల్లా ప్యాపిలిలో ప్రైవేటుగా టమాట మార్కెట్ నడుస్తోంది. పత్తికొండ టమాట మార్కెట్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేస్తున్నందున వ్యాపారులు సిండికేట్ కాకుండా కొనుగోళ్లు చేస్తున్నారు. దీంతో కిలో ధర రూ.7 ఆపైనే లభిస్తోంది. పత్తికొండ మార్కెట్‌తో పోలిస్తే ప్యాపిలిలో టమాట ధరలు తక్కువగా ఉంటున్నాయి. ఇక్కడ మార్కెట్‌పై ప్రభుత్వ అజమాయిషీ లేకపోవడంతో వ్యాపారులు ఇచ్చిందే ధరగా తయారైంది. కిలో ధర రూ.7 కంటే తక్కువకు పడిపోతుండటంతో మార్కెటింగ్ శాఖ అధికారులు రైతులు నష్టపోకుండా కొనుగోలు చేస్తున్నారు. సెప్టెంబరు రెండో వారం నుంచి మార్కెటింగ్ శాఖ అధికారులు టమాట కొనుగోళ్లు చేస్తున్నారు. ఈ నెల 8వ తేదీ నాటికి 140 టన్నుల టమాట కొనుగోలు చేశారు. ప్యాపిలిలో రైతుల నుంచి కొనుగోలు చేసిన టమాటను కర్నూలు, విజయవాడ, గుంటూరు రైతుబజార్లకు తరలిస్తున్నారు. కర్నూలు నగరంలోని మూడు రైతుబజార్లు, ఆదోని రైతుబజారుకు తరలించి నోలాస్, నో ప్రాఫిట్ కింద అమ్ముతున్నారు.

చీకట్లను తొలగిస్తూ.. వెలుగును పంచుతూ!

- జూనియన్ లైన్‌మెన్లు విధుల్లో చేరి నాలుగేళ్లు పూర్తి
- జేఎల్ఎంల రాకతో పల్లెల్లో చీకటి కష్టాలకు చెక్
- రెండేళ్ల ప్రొబేషన్ పూర్తి చేసుకున్న వారికి ఇటీవలే క్రమబద్ధీకరణ
- రెట్టింపు వేతనం.. ఇతర అలవెన్స్‌ల వర్తింపు



పోల్ టెస్టులో భాగంగా విద్యుత్ స్తంభం ఎక్కుతున్న అభ్యర్థి (ఫైల్)

> సి. బెళగల్ మండలం ముడుమాల, బురాన్‌దొడ్డి గ్రామాల్లో వెయ్యికి పైగా కుటుంబాలు ఉన్నాయి. 2019 అక్టోబరు వరకు అక్కడ రెగ్యులర్ లైన్‌మెన్లు లేరు. ఐదారు గ్రామాలకు ఒకరిని ఇన్‌చార్జ్‌గా నియమిస్తే.. సమస్య వస్తే అతను ఆ ఊరికి వచ్చిన రోజే పనులు చేయించుకోవాలి. రాత్రే కాదు.. పగటి పూట ఫ్యూజ్ పోయినా, సరఫరాలో అంతరాయం ఏర్పడినా పరిష్కరించే నాథుడు ఉండేవాడు కాదు. పనుల కోసం అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. వైఎస్ఆర్‌సీపీ అధికారంలోకి వచ్చాక పరిస్థితులు మారాయి. జిల్లాలో ఆ రెండు గ్రామాల్లో కాదు.. 658 గ్రామాల్లో విద్యుత్ సరఫరా మెరుగుపడింది. విద్యుత్ సమస్య ఏర్పడితే నిమిషాల్లో లైన్‌మ్యాన్ పరిష్కారం చూపే రోజులు వచ్చాయి.

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజల వద్దకే పాలన అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చారు. సచివాలయాల్లో ప్రధాన శాఖల సిబ్బందిని నియమించారు. ఇందులోనే విద్యుత్ శాఖ ఎనర్జీ అసిస్టెంట్లు/జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం) గ్రేడ్–2ల పేరుతో నియామకాలు చేశారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 658 మందికి ఉద్యోగాలివ్వగా 90శాతం మంది స్థానికంగా ఉంటూ, ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తున్నారు. రెండేళ్ల కాలాన్ని పూర్తి చేసుకున్న వారిని ఇటీవలే రెగ్యులర్ చేశారు.

పట్టించుకోని చంద్రబాబు

విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు లైన్‌మెన్లు చాలా కీలకం. 2006లో వైఎస్సార్ హయాంలో 196 కాంట్రాక్టు సీజేఎల్ఎం పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసినా అర్హత ఉన్న 483 మందిని ఉద్యోగాల్లోకి తీసుకున్నారు. తర్వాత ఖాళీలు ఉన్నా చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లైన్‌మ్యాన్ ఉద్యోగాలు భర్తీ చేశారు.

13 ఏళ్ల తరువాత..

2006 తరువాత లైన్‌మెన్ పోస్టుల భర్తీ జరగలేదు. 2019లో ఎస్‌పీడీసీఎల్‌లోని 8 జిల్లాల్లో 5,107పోస్టులు భర్తీ చేశారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 658 పోస్టులు భర్తీ చేశారు. ఎలాంటి పైరవీలు, ఎవరి సిఫార్సులకు తావు లేకుండా కేవలం అర్హతే ప్రామాణికంగా ఉద్యోగాలిచ్చారు. ఐటీఐ ఎలక్ట్రీషియన్ చదివిన వారికి స్తంభం ఎక్కడం, మీటర్ రీడింగ్, సైకిల్ తొక్కడం వంటి పరీక్షలు పెట్టి ప్రతిభకే పట్టం కట్టారు. కర్నూలు డివిజన్‌లో 168 పోస్టులు భర్తీ చేయగా నంద్యాలలో 166, డోన్‌లో 116, ఆదోనిలో 196 మంది నియమించారు. వీరిలో గ్రామ సచివాలయాలకు 508 మందిని, వార్డు సచివాలయాలకు 150 మందిని కేటాయించారు.

కరోనా వేళ.. సమస్యల్లేకుండా సరఫరా

టీడీపీ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో కరెంటు పోతే ఎప్పుడు వస్తుందో చెప్పలేని పరిస్థితి. మరమ్మతు చేసే వారు ఉండేవారు కాదు. రాత్రి వేళల్లో చీకట్లు తప్పవే కావు. అయితే, జేఎల్ఎంల భర్తీతో అంతరాయ సమస్యలు తగ్గాయి. కరోనా సమయంలో ప్రతి ఒక్కరూ ఇళ్లకే పమిమితమయ్యారు. ఆ సమయంలో విద్యుత్ ఎంతో అత్యవసరంగా మారింది. అప్పట్లో నిరంతర సరఫరా, అంతరాయ సమస్యలు వచ్చినా వెంటనే స్పందించి పరిష్కారం చూపారు.

విధుల్లో చేరి నాలుగేళ్లు పూర్తి

2019లో సెప్టెంబరులో నోటిఫికేషన్ ద్వారా పోస్టులు భర్తీ చేసిన ప్రభుత్వం అక్టోబరు 7లోపు విధుల్లో చేరేలా ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో జేఎల్ఎంలు ఉద్యోగంలో చేరి నాలుగేళ్లు పూర్తి చేసుకున్నారు. రెండేళ్ల ప్రొబేషన్ పూర్తి చేసుకున్న వీరికి 2022 జూలై 1 నుంచే రెగ్యులర్ చేశారు. దీంతో రూ.15వేలు ఉన్న వారి వేతనం రెట్టింపు అయ్యింది. హెచ్ఆర్ఏ, డీఏ, రుణ సదుపాయం కల్పించారు. ప్రభుత్వ నిర్ణయంతో ఉద్యోగుల కుటుంబాల్లో ఆనందం నెలకొంది.

గ్రామాల్లో మెరుగైన సేవలు



విద్యుత్ సరఫరాలో సమస్యలు వచ్చిన వెంటనే స్పందిస్తున్నాం. 2019లో జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్–2 పోస్టులను భర్తీ చేయడంతో సిబ్బంది కొరత తగ్గింది. దీంతో పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా సేవల్లో మెరుగుదల వచ్చింది. ట్రిప్పింగ్స్, బ్రేక్ డౌన్ సమస్యలు బాగా తగ్గాయి. ఫిర్యాదులపై వెంటనే చర్యలు చేపడుతున్నాం. – ఎం. ఉమాపతి, ఆపరేషన్స్ ఎస్ఈ, కర్నూలు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతి చెందిన కమ్మరి సూరయ్య ఆచారి

బనగానపల్లెరూరల్: యనకండ్ల గ్రామ సమీపంలో విద్యుదాఘాతంతో కమ్మరి సూరయ్య ఆచారి (52) అనే వ్యక్తి మృత్యువాత పడ్డాడు. మండలంలో సంకలాపురం గ్రామానికి చెందిన సూరయ్య ఆచారి కార్పెంటర్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆదివారం యనకండ్ల గ్రామంలోని సంజీవగౌడ్‌కు చెందిన రేకులషెడ్డుపై ఐరన్ షీట్స్ తొలగిస్తుండగా ప్రమాదశాత్తూ షెడ్డుపై వెళ్లిన విద్యుత్ తీగలు చేతికి తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద విషయం తెలుసుకున్న బనగానపల్లె ఎస్‌ఐ వీరాంజనేయులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనాథ వ్యక్తి మృతి



మృతి చెందిన అనాథ వ్యక్తి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఆదివారం ఓ అనాథ వ్యక్తి మృతి చెందాడు. నగరంలో ఓ చోట పడి ఉన్న అతన్ని స్థానికులు తీసుకొచ్చి ఆసుపత్రిలో చేర్పి వెళ్లారు. కొద్దిరోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతను తన పేరు హుసేన్ అని, బుధవారపేటవాసిగా మాత్రం చెప్పినట్లు ఆసుపత్రి సిబ్బంది చెబుతున్నారు. ఆదివారం అతను కోలుకోలేక మృతి చెందడంతో మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు.

యువకుడి బలవన్మరణం

పగిడ్యాల: జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం పడమర ప్రాతకోట గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తెలుగు వెంకటేశ్వర్లు కుమారుడైన భరత్(20) జూపాడుబంగ్లా మండలంలోని మండ్లెం గ్రామంలో గోబీ సెంటర్‌లో పని చేస్తున్నాడు. ఇటీవలే తల్లిదండ్రులు ప్రైవేట్ హౌసింగ్‌లోన్ తీసుకున్నారు. ఆ అప్పుభారాన్ని తీర్చాలని ప్రైవేటు బ్యాంకర్లు భరత్‌ను వేధింపులకు గురిచేశారని బంధువులు తెలిపారు. తక్కువ వేతనంతో పనిచేస్తున్న భరత్ లక్షల రూపాయల్లో చేసిన అప్పును తీర్చలేక జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్య విషయం తమదృష్టికి వచ్చిందని, ఎవరూ ఫిర్యాదు చేయలేదని ముచ్చుమర్రి ఎస్‌ఐ నాగర్జున తెలిపారు.

నేడు బూడిదపాడులో విగ్రహాల ఆవిష్కరణ

కర్నూలు(రాజ్‌విహార్): తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ వర్ధంతి సందర్భంగా గూడూరు మండలం బూడిదపాడు గ్రామంలో సోమవారం విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని ఇంటలెక్చువల్ కలెక్టివ్ సంస్థ కర్నూలు జిల్లా కన్వీనర్ ఎం. ఖదీరుల్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలేతో పాటు స్త్రీల విద్య కోసం ఎనలేని కృషి చేసిన ఫాతిమా షేక్ విగ్రహాలను గ్రామంలోని ఎంపీ యూపీ పాఠశాలతో ఆవిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళ, ఇంటలెక్చువల్ కలెక్టివ్స్ సంఘాల ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆరోగ్య సిరి ధాన్యాలు!

- చిరుధాన్యాల్లో పుష్కలంగా ప్రొటీన్లు, పీచు పదార్థాలు
- నాడు పేదల ఆహారం.. నేడు పెద్దల ఆహారం
- కాల్షియంతో ఎముకల పటుత్వం
- ఐరన్‌తో రక్తహీనతకు చెక్
- చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- ఆసక్తి చూపుతున్న రైతన్నలు



కోవెలకుంట్ల: ఉరుకుల పరుగుల జీవితం, సమయ పాలనలేని ఆహార నియమాలు, మానసిక ఒత్తిళ్లతో నేటి తరం చిన్న వయస్సులోనే బీపీ, షుగర్, తదితర వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ సమస్య నుంచి బయట పడేందుకు మారిన ఆధునిక జీవన శైలికి అనుగుణంగా ఆహారంలో మార్పులు అవసరమని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. ప్రధానంగా మన పూర్వీకులు తీసుకున్న చిరుధాన్యాల ఆహారం తీసుకోవడం ఉత్తమమని తెల్పి చెబుతున్నారు. దీంతో ఈ చిరుధాన్యాల సాగును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. సాగుకు ప్రత్యేక రాయితీలు ఇవ్వడంతో పాటు పంటలకు మద్దతు ధర ప్రకటించి రైతులకు అండగా నిలుస్తున్నాయి. నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 6,956 హెక్టార్లలో చిరుధాన్య పంటలైన జొన్న, సజ్జ, కొర్ర సాగుకావాల్సి ఉండగా ఇప్పటి వరకు 6,777 హెక్టార్లలో సాగు చేశారు. రబీ సీజన్‌లో 32 వేల హెక్టార్లలో చిరుధాన్యాల పంటల సాగు లక్ష్యంగా నిర్ణయించారు.

చిరుధాన్యాల్లో పుష్కలంగా పోషకాలు

చిరు ధాన్యాలైన రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు, ఊదలు, సామలు, ఆరికెలు, వరిగలు వంటి చిరుధాన్యాల్లో పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. వాటితో ప్రతి రోజు దోసెలు, ఉప్మా, పొంగలి, తదితర సంప్రదాయ వంటకాలను తయారు చేసుకుని తీసుకోవడం ద్వారా పోషకాలు పొందవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. చిరుధాన్యాల్లో అమైనో, కొవ్వు ఆమ్లాలు, బీ,ఈ విటమిన్లు, ఐరన్, మెగ్నీషియం, పొటాషియం వంటి పోషకాలతో పాటు కార్బోహైడ్రేట్లు, ప్రొటీనులు, పీచు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. వీటిని రోజువారీ ఆహారంగా తీసుకోవడం వల్ల బీపీ, షుగర్, మలబద్ధకం వంటి దీర్ఘకాలిక వ్యాధుల నుంచే కాక పలు రకాల రోగాల నుంచి రక్షణ పొందవచ్చు. జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు, ఆరికెలతో వివిధ రకాలైన ఆహార పదార్థాలు చేసుకుని తినవచ్చని డాక్టర్లు పేర్కొంటున్నారు. వీటిల్లో ఫైబర్ అధికంగా ఉండటంతో అది గ్లూకోజ్‌గా మారి రక్తంలో కలవడానికి నిర్దిష్ట సమయం తీసుకుంటుంది. దీని వల్ల మధుమేహం, మలబద్ధకం వంటి సమస్యలు దరి చేరవు. చిరు ధాన్యాలతో ఇంట్లో రకరకాల వంటలు చేసుకుని తీసుకోవడం వల్ల పోషకాహార లోపం తీరడంతోపాటు రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల అందులో ఉండే కాల్షియంతో ఎముకల్లో పటుత్వం పెరుగుతుంది. ఐరన్‌తో రక్తహీనత నుంచి బయట పడవచ్చు.

నేడు సంపన్న వర్గాల ఆహారం

పూర్వ కాలం పేద కుటుంబాలు చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారాన్ని తీసుకునేవారు. ప్రస్తుతం ఆధునిక జీవన శైలిలో వచ్చిన మార్పులతో నేడు ఆ ధాన్యాలు సంపన్నవర్గాలకు ఆహారంగా మారింది. దీనికితోడు ఎన్నో రోగాల నివారణకు చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తుండటంతో వాటికి డిమాండ్ పెరిగింది. అధిక ధర చెల్లించి వీటిని కొనుగోలు చేసే పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో చిరుధాన్యపంటలైన కొర్ర, సజ్జ, ఆరికల, రాగులు, సామలు, ఊదలను విస్తారంగా సాగు చేసేవారు. వరి సాగు రావడంతో క్రమేపీ వాటి సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిరుధాన్యాల సాగుకు అన్ని రకాల ప్రోత్సాహం కల్పిస్తుండటంతో రైతులు మళ్లీ ఆయా పంటలపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఐక్యరాజ్యసమితి భారతదేశ మద్దతుతో 2023 సంవత్సరాన్ని చిరు ధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. ఈ ధాన్యాలతో తీసుకునే ఆహారం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రపంచ జనాభాకు తెలియజేస్తోంది.

చిరు ధాన్యాలతో ఆరోగ్య ప్రయోజనాలు



చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. బీపీ, షుగర్, గుండె జబ్బుల నుంచి కాపాడుకోవచ్చు. చిరుధాన్యాల్లో ప్రోటీనులు, పీచు పదార్థాలు ఉన్నందున జబ్బులు దరి చేరవు. జొన్న రొట్టె, రాగిముద్ద, కొర్ర, ఆరెకలతో తయారు చేసిన వంటకాలను ప్రతి రోజు ఆహారంగా తీసుకోవడం మేలు.

– విద్యాసాగర్, డాక్టర్, రేవనూరు పీహెచ్‌సీ

ప్రతి రోజు జొన్న రొట్టె



నాకు కొన్ని సంవత్సరాల క్రితం షుగర్ వ్యాధి వచ్చింది. అప్పటి నుంచి ప్రతి రోజు రాత్రి సమయాల్లో జొన్న రొట్టె, రాగిముద్ద, కొర్ర అన్నంతో కూడిన ఆహారం తీసుకుంటున్నాను. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చౌక దుకాణాల ద్వారా ప్రతి నెల జొన్నలు, రాగులు సరఫరా చేస్తోంది.

– జగన్‌మోహన్‌రెడ్డి, కోవెలకుంట్ల

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం



చిరుధాన్యాల సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం కల్పిస్తోంది. కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో జొన్న, కొర్ర, సజ్జ పంటలను ప్రతి ఏటా రైతులు సాగు చేస్తున్నారు.వారికి సబ్సిడీపై విత్తనాలు, మద్దతు ధర కల్పించి ఆదుకుంటోంది. రైతులు సద్వినియోగం చేసుకుని చిరుధాన్య పంటలను విస్తారంగా సాగు చేయాలి.

– నిరంజన్, ఏఓ, కోవెలకుంట్ల

వైభవం.. మల్లన్న కల్యాణం



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న పండితులు

శ్రీశైలంప్రాజెక్ట్: ధర్మప్రచారంలో భాగంగా శ్రీశైల దేవస్థానం ఆదివారం చిలుకలూరిపేటలో మల్లన్న కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించింది. స్థానిక ఆర్యవైశ్య పద్మావతి కల్యాణ మండపంలో ముందుగా లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు కల్యాణోత్సవ సంకల్పాన్ని పఠించారు. అనంతరం గణపతిపూజ, పుణ్యాహవాచనం, వరపూజ, ప్రవర పఠనాన్ని చేశారు. స్వామి వారికి మధుపర్కం సమర్పించబడిన తర్వాత శ్రీస్వామిఅమ్మ వార్లకు వస్త్రాలను సమర్పించి భాషికధారణ చేశారు. అనంతరం అమ్మవారికి మాంగల్య ధారణ జరిపించి, తలంబ్రాలు, బ్రహ్మముడి కార్యక్రమాలను జరిపి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ ఆశీర్వచనాన్ని అందజేశారు.

వాటర్‌షెడ్ అదనపు పీడీగా ఆదెయ్య

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా నీటియాజమాన్య సంస్థ(డ్వామా) వాటర్‌షెడ్స్ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఆదెయ్య నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం డ్వామాలో ఫైనాన్స్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇంతవరకు అడిషనల్ పీడీగా పనిచేసిన సలీమ్‌బాషా డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమితులయ్యారు. గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఈయనను ఈ బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు. దీంతో తాత్కాలికంగా ఫైనాన్స్ మేనేజర్ ఆదెయ్యకు వాటర్‌షెడ్స్ అదనపు పీడీ బాధ్యతలు అప్పగిస్తూ గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఖాళీ అయిన ఈ పోస్టులో గూడూరు ఎంపీడీవో మాధవీలత నియమితులయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

15 నుంచి దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు

బనగానపల్లెరూరల్: నందవరంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి రామానుజన్ ఆదివారం తెలిపారు. శరన్నవరాత్రి అలంకారా ల్లో భాగంగా అమ్మవారిని 15న శ్రీశైలపుత్రిగా, 16న బ్రహ్మచారిణిగా, 17న చంద్రఘంట అలంకారంలో, 18న కూష్మాండ దుర్గగా, 19న స్కందమాతగా, 20న కాత్యాయణిగా, 21న కాళరాత్రి అలంకారంలో, 22న మహా గౌరిగా, 23న సిద్ధిధాత్రిగా, 24న విజయదశమి రోజు నిజరూప అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని ఈఓ తెలిపారు.

21న మంత్రాలయానికి మల్లికార్జున ఖర్గే రాక

కర్నూలు(సెంట్రల్): కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈనెల 21వ తేదీన మంత్రాలయం రానున్నట్లు కర్నూలు డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు తెలిపారు. అక్టోబర్ 21వ తేదీ నాటికి రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర మంత్రాలయం నియోజకవర్గంలోకి ప్రవేశించి ఏడాది పూర్తి అవుతున్న సందర్భంలో అక్కడ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సభకు మల్లికార్జున ఖర్గేతోపాటు పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, పలువురు జాతీయ, రాష్ట్ర నేతలు హాజరవుతున్నారు. ఈక్రమంలో ఆదివారం మంత్రాలయంలో హెలిప్యాడ్, సభా స్థలాలను పరిశీలించినట్లు ఆయన చెప్పారు.

రేపు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఆర్చరీ, బాస్కెట్‌బాల్, నెట్‌బాల్, రగ్బీ వంటి క్రీడాంశాల్లో ఈనెల 10వ తేదీ బి. క్యాంపు క్రీడా మైదానంలో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జి. లక్ష్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు ఉదయం 9 గంటలకు స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో సైక్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, కరాటే పోటీలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారుల ప్రవేశ దరఖాస్తులు, మిడ్ డే మీల్స్ ఫారాలను వ్యాయామ ఉపాధ్యాయులు వెంట తీసుకురావాలని సూచించారు.వివరాలకు 9440481007ను సంప్రదించాలన్నారు.

12 గంటల్లోనే బ్యాగ్ రికవరీ



బ్యాగును మహిళకు అందిస్తున్న ఎస్‌ఐ సుబ్బరామిరెడ్డి

బొమ్మలసత్రం: ప్రయాణికురాలు ఆటోలో మరిచి పోయిన బ్యాగును 12 గంటల్లోనే రికవరీ చేశామని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్‌కు చెందిన చల్లా సుజాత శనివారం రాత్రి హైదరాబాద్ నుంచి నంద్యాలకు వచ్చే క్రమంలో పట్టణంలోని నూనెపల్లె సాయికృష్ణ హాస్పిటల్ నుంచి జగజ్జనని గుడి ఏరియాలోని తన బంధువుల ఇంటికి వెళ్లేందుకు ఆటోలో బయలుదేరింది. ఇంటికి వెళ్లిన అనంతరం తనతో పాటు తెచ్చుకున్న మొబైల్ ఫోన్, డబ్బులు, 2 తులాల బంగారు ఉన్న బ్యాగ్ కనిపించడం లేదు. దీంతో వెంటనే ఒకటవ పట్టణ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన ఎస్‌ఐ సుబ్బరామిరెడ్డి ఆమె ప్రయాణించిన ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించి బ్యాగు ఆటోలోనే ఉన్నట్టు నిర్ధారించుకున్నారు. వెంటనే ఆటో డ్రైవర్ వద్ద నుంచి బ్యాగ్‌ను రికవరీ చేసి బాధితురాలు చల్లా సుజాతకు అందజేశారు. ఇందుకు కృషి చేసిన ఒకటవ పట్టణ ఎస్‌ఐని ఎస్పీ అభినందించారు. ప్రజలు తమ వ్యాపార సముదాయాలు, గృహాలు, కార్యాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే విలువైన వస్తువులు, ఆస్తులను కాపాడుకోవచ్చని సూచించారు.

మంత్రి గుమ్మనూరుకు మాతృ వియోగం



శారదమ్మ(ఫైల్)



నివాళులర్పిస్తున్న ఆదోని, మంత్రాలయం ఎమ్మెల్యేలు సాయి ప్రసాద్‌రెడ్డి, బాలనాగిరెడ్డి

ఆలూరు: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం మాతృమూర్తి, గుమ్మనూరు గ్రామ మాజీ సర్పంచ్ పి.శారదమ్మ (79) గుండెపోటుతో మృతి చెందారు. ఆలూరులో ఉపాధ్యాయనగర్ కాలనీలోని ఇంట్లో ఆదివారం ఉదయం ఆమె ఆకస్మాత్తుగా కుప్పకూలిపోయింది. వెంటనే కుటుంబీకులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. భౌతికకాయాన్ని చిప్పగిరి మండలం గుమ్మనూరు గ్రామానికి తరలించారు. విషయం తెలుసుకున్న ఆదోని, మంత్రాలయం ఎమ్మెల్యేలు సాయిప్రసాద్‌రెడ్డి, బాలనాగిరెడ్డి, కర్ణాటక రాష్ట్ర మంత్రి బి.నాగేంద్ర తదితరులు గుమ్మనూరు చేరుకుని నివాళులు అర్పించి సంతాపాన్ని వ్యక్తం చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు, రాజకీయనాయకులు మంత్రికి ఫోన్ చేసి పరామర్శించారు. అలాగే మంత్రి సోదరులు శ్రీనివాసులు, నారాయణస్వామిని కూడా పలువురు పరామర్శించారు. సాయంత్రం శారదమ్మకు కన్నీటి వీడ్కోలు పలికి అంత్యక్రియలు నిర్వహించారు.

వివాహిత ఆత్మహత్య

గోనెగండ్ల: వేముగోడు గ్రామానికి చెందిన వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన దేవనోల్లా సుస్మిత(20)కు అదే గ్రామానికి చెందిన బోయ పెద్దయ్యతో మూడేళ్ల క్రితం వివాహమైంది. అయితే గత కొంతకాలంగా సుస్మిత కడుపునొప్పితో బాధపడుతోంది. పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ మేరకు జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి మద్దిలేటి ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

కర్నూలు: నగర శివారులోని గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మృతులిద్దరు 30 ఏళ్లలోపు వారే. వివరాల్లోకి వెళితే..ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరక్‌పూర్ జిల్లాకు చెందిన సుధీర్‌కుమార్, కృష్ణకాంత్, కర్నూలు నగరంలోని సీతారాం నగర్‌కు చెందిన సాయిషణ్ముక (ఇంజినీరింగ్ స్టూడెంట్), ఏక్యాంప్‌కు చెందిన ముకుందా (ఇంజినీరింగ్ స్టూడెంట్) ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో కారులో డోన్ వైపు నుంచి కర్నూలు వైపు వస్తున్నారు. గుత్తిపెట్రోల్ బంకు సమీపంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపైన కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సాయిషణ్ముక, సుధీర్‌కుమార్ చనిపోగా మిగతా ఇద్దరు తీవ్ర గాయాలకు గురయ్యారు. స్థానికుల సమాచారం మేరకు 108 అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకొని క్షతగాత్రులిద్దరిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారు కోమాలో ఉన్నారు. కారులో ఉన్న నలుగురిలో ఇద్దరు చనిపోవడం, మరో ఇద్దరు కోమాలో ఉండడంతో వారు ఎక్కడికి వెళ్తున్నారు.. ఎక్కడి నుంచి వస్తున్నారు అనే విషయాలు తెలియని పరిస్థితి. ప్రమాద సంఘటన జరిగిన వెంటనే ట్రాఫిక్ సీఐ గౌతమి, ఎస్‌ఐ గిరిబాబు అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. మృతుల పూర్తి వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

బలిజలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బలిజ సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో అధిక సంఖ్యలో ఉన్న బలిజలకు అన్ని రాజకీయ పార్టీలు తగిన ప్రాధాన్యతను ఇవ్వాలని జిల్లా బలిజ సంఘం నాయకులు కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో కాపు సంక్షేమ సేన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కోనేటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సంఘం నాయకులు కోనేటి చంద్రబాబు, ఆర్జా రామక్రిష్ణ, సురేష్ మామిళ్ల, కొట్టే చెన్నయ్య తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల జిల్లాల్లో బలిజలకు రెండు ఎమ్మెల్యే, ఒక ఎంపీ స్థానాన్ని ఇవ్వాలన్నారు. తమకు రాజకీయ ప్రాధాన్యత కల్పించే పార్టీలకు మద్దతుగా నిలుస్తామన్నారు. ముఖ్యంగా బలిజ కాపు భవన నిర్మాణాలకు నిధులు విడుదల చేయాలని, అలాగే బలిజల ఆర్థికాభివృద్ధికి రూ.20 వేల కోట్లను కార్పొరేషన్‌కు కేటాయించాలన్నారు. కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ బలిజ యువతకు సబ్సిడీ రుణాలు అందించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఉల్లి మధు, సాయినాథ్, పుట్టా గురుమూర్తి, గుర్రాల రామాంజనేయులు, కంపిలి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో గణేష్ ఉత్సవాలు విజయవంతం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన



జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజనను సన్మానిస్తున్న ఉత్సవ సమితి ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: జిల్లా అధికారులు, ఉత్సవ సమితి ప్రతినిధుల సమన్వయంతో గణేష్ నిమజ్జనోత్సవాలు విజయవంతమయ్యాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన అన్నారు. గణేష్ మహోత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో ఆదివారం వీఆర్ కాలనీలోని ఏపీ టూరిజం ఫంక్షన్ హాల్‌లో అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించామని, అయితే, గణేష్ మహోత్సవం విజయవంతం ప్రత్యేకమన్నారు. కులమతాలకు అతీతంగా వినాయక నిమజ్జనాన్ని నగరంలో పండుగలా జరుపుకోవడం విశేషమన్నారు. ఎస్పీ కృష్ణ కాంత్ మాట్లాడుతూ అందరూ భక్తి తత్పరత, అంకిత భావం, సమైక్యతతో పని చేసి ఉత్సవాలు విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. డీఆర్వో మధుసూదనరావు, ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు కె.క్రిష్టన్న, నగర అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు మాట్లాడారు. అనంతరం కలెక్టర్, ఎస్పీలను సమితి ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఉపాధ్యక్షులు హరీష్‌బావు, తదితరులు పాల్గొన్నారు.

డోర్ డెలివరీతో అనేక లాభాలు

కర్నూలు(రాజ్‌విహార్): రోడ్డు రవాణా సంస్థ తీసుకొచ్చిన కార్గో, పార్సిళ్ల డోర్ డెలివరీతో అనేక లాభాలున్నాయని కర్నూలు-2 డిపో మేనేజరు సర్దార్ హుసేన్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన కార్గో సేవలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాణిజ్య, వ్యాపార వేత్తలు, వ్యాపారులు తమ సరుకులు, ఉత్పత్తులకు రాష్ట్రంలోని ఏ పట్టణానికైనా తమ తమ సంస్థ పార్సిల్స్ ద్వారా పంపుకోవచ్చన్నారు. డోర్ డెలివరీతో సమయం ఆదా అవుతుందని వెల్లడించారు.

రక్షణ గోడపై దర్జాగా చిరుత



పాలధార- పంచధార మెట్ల మార్గం గోడపై కూర్చున్న చిరుత

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల క్షేత్రపరిధిలోని పాలధార-పంచధార వద్ద శనివారం రాత్రి చిరుతపులి దర్జాగా గోడపై కూర్చుని ఉండడాన్ని భక్తులు చూసి భయాందోళనకు గురయ్యారు. మెట్ల మార్గంలోని సైడ్‌వాల్‌పై చిరుత కూర్చుని ఉండడాన్ని శ్రీశైలానికి వాహనంలో వచ్చే భక్తులు గమనించారు. వాహనంలో నుంచి సెల్‌ఫోన్‌లో చిరుతను కెమెరాలో బంధించారు. అనంతరం భక్తులు శబ్దాలు చేయడంతో అక్కడి నుంచి లోయ ప్రాంతంలోకి చిరుత వెళ్లిపోయింది. రాత్రివేళల్లో భక్తులు ఒంటరిగా ఎక్కడికీ వెళ్లరాదని, అటవీ సమీప ప్రదేశాల్లో తిరిగేటప్పుడు పెద్ద శబ్దాలు చేస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని అటవీశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

ముగిసిన మహిళా క్రీడా పోటీలు



హ్యాండ్‌బాల్ విజేతగా నిలిచిన సెయింట్ జోసెప్ డిగ్రీ కళాశాల జట్టు



కబడ్డీ విజేత ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల జట్టు

కర్నూలు (టౌన్): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో అంతర్ కళాశాలల మహిళా క్రీడా పోటీలు సెయింట్ జోసెప్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం సాయంత్రం ముగిశాయి. చెస్ పోటీల్లో సెయింట్ జోసెప్ డిగ్రీ కళాశాల, రాయలసీమ యూనివర్సిటీ కళాశాల, సెయింట్ జోసెప్ ఉమెన్స్ కళాశాల మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. హ్యాండ్‌బాల్ పోటీల్లో సెయింట్ జోసెప్ డిగ్రీ కళాశాల, ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల, సెయింట్ జోసెప్ ఉమెన్స్ కళాశాల, ఖోఖోలో సెయింట్ జోసెప్ ఉమెన్స్ కళాశాల, సెయింట్ జోసెప్ కళాశాల, ఎస్ఎంఎల్ డిగ్రీ కళాశాల, వాలీబాల్‌లో సెయింట్ జోసెప్ ఉమెన్స్ కళాశాల, బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాల, సెయింట్ జోసెప్ డిగ్రీ కళాశాల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. కబడ్డీలో ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల, సెయింట్ జోసెప్ డిగ్రీ కళాశాల, ఎస్ఎంఎల్ డిగ్రీ కళాశాల మొదటి మూడుస్థానాలను దక్కించుకున్నాయి. విజేతలకు షీల్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెయింట్ జోసెప్ డిగ్రీ కళాశాల డీన్ వై. శౌరీలురెడ్డి పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు జరిగే ప్రాంతాలు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో ఈ నెల 9వ తేదీన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహించే ప్రాంతాలను ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు ప్రకటించారు.

మండలం/పట్టణం	వైద్యశిబిరం జరిగే ప్రాంతం
ఎమ్మిగనూరు	కొటేకల్-2
వెల్దుర్తి	మాదార్‌పురం
తుగ్గలి	ఎద్దులదొడ్డి
మంత్రాలయం	బసాపురం
కర్నూలు	జొహరాపురం యుపీహెచ్‌సీ
కర్నూలు	పడిదెంపాడు
కౌతాళం	బాపురం
కోడుమూరు	ముడుమలగుర్తి
హొళగుంద	ఎల్లార్తి
గూడూరు	పెంచికలపాడు
సి.బెళగల్	బురాన్‌దొడ్డి-2
ఆలూరు	కురుకుంద
ఆదోని	మదిరె-2